# రైతులు, ప్రభుత్వం మధ్య విశ్వాస లోపం

- ఇద్దరి మధ్య 'తటస్థ అంపైర్లు' ఉండాలి
- రైతు సమస్యల పరిష్కారానికి కమిటీ
- సర్వోన్నత న్యాయస్థానం ప్రతిపాదన
- శంభు సరిహద్దు వద్ద యథాతథ స్థితి
- పంజాబ్, హర్యానా ప్రభుత్వాలకు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 24: రైతుల ఆందోళనలపై సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న రైతులకు, ప్రభుత్వాలకు మధ్య విశ్వాసం లోపించినట్టు కనిపిస్తున్నదని అభిప్రాయపడింది. రైతుల సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలకు కోర్టు సూచించింది. ప్రభుత్వం, రైతుల మధ్య విశ్వాసాన్ని కలిగించేందుకు 'తటస్థ అంపైర్లు' ఉండాల్సిన అవసరం ఉన్నదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం పేర్కొన్నది. కమిటీలో సభ్యుల పేర్లను సూచించాలని రెండు ప్రభుత్వాలకు సూచించింది. హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకట్టల్ని తొలగించాలన్న పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ హర్యానా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. డిమాండ్ల సాధన కోసం రైతులు ఈ ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన 'చలో ఢిల్లీ' మార్చ్‌ను అడ్డుకొనేందుకు ప్రభుత్వం శంభు సరిహద్దు హైవేను దిగ్బంధించింది. బారికేడ్లు, ఇతర అడ్డంకులను ఏర్పాటు చేసి అడ్డుకోవడంతో రైతులు అక్కడే ఆందోళనకు దిగారు.

### విశ్వాసం కలిగించే చర్యలు తీసుకోవాలి

విచారణ సందర్భంగా ప్రభుత్వానికి సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. ఆందోళన చేస్తున్న రైతులతో చర్చించేందుకు ఏమైనా చొరవ తీసుకొన్నారా? అని ప్రశ్నించింది. 'మీ మంత్రులు స్థానిక సమస్యలు తెలియకుండా రైతుల వద్దకు వెళ్లి ఉండొచ్చు. అక్కడే రైతులకు, ప్రభుత్వానికి విశ్వాసం లోపం కనిపిస్తున్నది. కొంత మంది తటస్థ అంపైర్లు ఎందుకు ఉండకూడదు? ఇద్దరి మధ్య విశ్వాసాన్ని కలుగజేసేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది' అని ధర్మాసనం అభిప్రాయపడింది. పిటిషన్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసిన న్యాయస్థానం.. శంభు సరిహద్దు వద్ద యథాతథ స్థితిని కొనసాగించాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా బారికేడ్ల తొలగింపుపై ఒక ప్రణాళికను ప్రతిపాదించాలని సూచించింది.

### ముందు రైతుల వద్దకు వెళ్లాలి

రైతులను ఢిల్లీలోకి అనుమతిస్తే, శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్నదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ ' మీరు(ప్రభుత్వం) కొంత ప్రయత్నం చేయాలి. అన్నిటి కంటే ముందు మీరు రైతుల వద్దకు వెళ్లాలి. లేకుంటే వారు(రైతులు) ఎందుకు ఢిల్లీ రావాలని అనుకొంటారు?' అని పేర్కొన్నది. రైతులను తమ ట్రాక్టర్లు, ఇతర వాహనాలను సాయుధ ట్యాంకులుగా మార్చారని మెహతా పేర్కొనగా.. 'మీరు చేస్తున్న వాదనలు కూడా విశ్వాస లోపాన్ని చూపిస్తున్నాయి' అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

## హామీల అమలులో కేంద్రం విఫలం

హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వ విఫలమైందని రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్ల సాధన కోసం ఢిల్లీకి మార్చ్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పంజాబ్, హర్యానా, యూపీ పలు ఇతర రాష్ట్రాలకు చెందిన నేతలు బుధవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని పార్లమెంట్ కాంప్లెక్స్‌లో కలిసారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై చర్చించారు. ఎంఎస్పీకి చట్టబద్ధతను సాధించేందుకు ప్రభుత్వంపై విపక్ష ఇండియా కూటమి ఒత్తిడి తీసుకొస్తుందని రాహుల్ పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధర దక్కడం రైతుల హక్కు అని, ఆ హక్కు వారికి దక్కేలా కృషి చేస్తామని అన్నారు.

*నేపాల్‌లో బుధవారం ఓ విమానం కుప్పకూలడంతో 18 మంది ప్రాణాలు కోల్పోగా, పైలట్ గాయాలపాలయ్యారు. కాఠ్మాండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉన్న రెండో రన్‌వే నుంచి పొఖారాకు బయల్దేరిన బొంబార్డియర్ సీఆర్‌జే-200 విమానం.. టేకాఫ్ అయిన నిమిషంలోనే కూలిపోయింది. బుధవారం ఉదయం 11.11 గంటలకు (స్థానిక కాలమానం) ఈ దుర్ఘటన జరిగింది. ఈ విమానంలో మొత్తం 19 మంది ఉన్నారు. వీరిలో పైలట్ మనీశ్ రత్న షాక్య (37)కు తీవ్ర గాయాలయ్యాయి. 15 మంది అక్కడికక్కడే మృతి చెందగా, దవాఖానలో చికిత్స పొందుతూ ముగ్గురు మరణించారు. - కాఠ్మాండు*

## టిఫిన్ డబ్బులు కావాలంటే నేనిస్తా!

**ఎమ్మెల్యేలపై గవర్నర్ రూ.500 ఫైన్ వేయడంపై మమత చురకలు**

కోల్‌కతా, జూలై 24: ఇటీవల అసెంబ్లీ స్పీకర్ ముందు ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన ఇద్దరు టీఎంసీ ఎమ్మెల్యేలపై గవర్నర్ రూ.500 జరిమానా విధించడంపై పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి ఫైర్ అయ్యారు. అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకొనేందుకు గవర్నర్ ఆనంద్ బోస్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'మీకు టిఫిన్‌కు డబ్బులు కావాలంటే, నన్ను అడగండి నేనిస్తా' అంటూ గవర్నర్ ఆదేశాలపై చురకలు అంటించారు. 'రాజ్‌భవన్ సెలెక్టెడ్, అసెంబ్లీ ఎలెక్టెడ్' అనే విషయాన్ని గవర్నర్ గుర్తుంచుకోవాలన్నారు. నేరగాళ్లు, నీట్ స్కామ్ సూత్రదారులపై ఫైన్ వేయలేని ఆయన.. ప్రజల చేత ఎన్నుకోబడ్డ ఎమ్మెల్యేలపై ఫైన్ వేస్తున్నారని, ఒక రాజకీయ పార్టీకి కొమ్ము కాయకూడదని హితవు పలికారు. గవర్నర్ ఆదేశించిన విధంగా కాకుండా స్పీకర్ ముందు ప్రమాణ స్వీకారం చేయడం, అసెంబ్లీకి హాజరవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ టీఎంసీ ఎమ్మెల్యేలు సయంతికా బెనర్జీ, హుస్సేన్ సర్కార్‌పై రూ.500 జరిమానా విధిస్తూ రాజ్‌భవన్ సోమవారం ఇద్దరికి ఈమెయిల్ చేసిన విషయం తెలిసిందే.

## నీట్ రద్దుకు బెంగాల్ అసెంబ్లీ తీర్మానం

కోల్‌కతా: నీట్ పరీక్షపై నిరసన గళం విప్పిన రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ కూడా చేరింది. వైద్య విద్యా సంస్థలలో ప్రవేశం కోసం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్‌ను రద్దు చేసి, ఆయా రాష్ట్రాలే వాటిని నిర్వహించుకునేలా పూర్వపు పరీక్షా విధానాన్ని పునరుద్ధరించాలని బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ బుధవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించింది. ఇలా నీట్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసిన రాష్ట్రాల జాబితాలో బెంగాల్ రెండవది. అంతకుముందు తమిళనాడు కూడా నీట్ తమకు వద్దంటూ అసెంబ్లీలో తీర్మానించింది.

### పరీక్షల్లో అక్రమాల నిరోధానికి
## బీహార్‌లో బిల్లు

పాట్నా: ప్రవేశపరీక్షల్లో అక్రమాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేందుకు బీహార్ శాసనసభ బుధవారం ఓ బిల్లును ఆమోదించింది. గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, రూ.1 కోటి వరకు జరిమానా విధించేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తున్నది. వేరొకరి కోసం పరీక్షలు రాస్తూ పట్టుబడితే మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించవచ్చునని చెప్తున్నది.

*అమెరికాలో 'హైడ్రోథర్మల్ పేలుడు'* — *అమెరికాలో ఓ భారీ పేలుడు అందరినీ ఆందోళనకు గురిచేసింది. బిస్కెట్ బేసిన్‌లోని యెల్లోస్టోన్ జాతీయ పార్కులో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. భూమిలో భారీ శబ్దంతో పేలుడు సంభవించి నీరు, మట్టి ఎగిసిపడ్డాయి. దీంతో సందర్శకులు భయంతో పరుగులు తీశారు. దీనిని 'హైడ్రోథర్మల్' పేలుడుగా అమెరికా జియాలాజికల్ సర్వే వెల్లడించింది. భూమి లోపల నీరు వేడెక్కి, ఆవిరిగా మారినప్పుడు ఒత్తిడి ఏర్పడుతుందని, ఒత్తిడి పెరిగినప్పుడు ఇలా పేలుళ్లు సంభవిస్తాయని, వీటిని హైడ్రోథర్మల్ పేలుళ్లు అంటారని తెలిపింది. - లాస్ ఏంజెల్స్*

## చావలేదని నిరూపించేందుకు నేరం!

న్యూఢిల్లీ: ఓ వ్యక్తి మరణించినట్లు ప్రభుత్వ రికార్డులు చెప్తుండగా, తాను జీవించే ఉన్నానని నిరూపించుకోవడానికి ఆ వ్యక్తి నేరగాడిగా మారారు. రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా, మిథోరా గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థుడు బాబూరామ్ భిల్ మరణించినట్లు అధికారులు మరణ ధ్రువపత్రాన్ని జారీ చేశారు. తాను సజీవంగా ఉన్నానని, రికార్డుల్లో పొరపాటును సరిదిద్దాలని ఆయన అధికారులను అనేక విధాలుగా కోరారు. కానీ ఫలితం లేకపోయింది. దీంతో ఆయన ఈ నెల 19న గ్రామంలోని పాఠశాలకు వెళ్లి, ఇద్దరు టీచర్లను, మరో వ్యక్తిని కత్తితో పొడిచారు. కొందరు టీచర్లు, విద్యార్థులను నిర్బంధించారు. ఈ సమాచారాన్ని అందుకున్న పోలీసులు వచ్చి, ఆయనను అరెస్ట్ చేశారు. తాను మరణించినట్లు ధ్రువపత్రం జారీ చేశారని, తాను సజీవంగా ఉన్నట్లు నిరూపించడానికే ఈ విధంగా చేశానని భిల్ చెప్పారు.

## కూలీకి దొరికిన రూ.80 లక్షల వజ్రం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలో రాజు గౌడ్ అనే కూలీకి అదృష్టం వరించింది. జీవనోపాధి కోసం గనులను కౌలుకు తీసుకునే రాజు ప్రతి రోజూ మాదిరిగానే బుధవారం కూడా మట్టిని తవ్వుతున్నారు. ఆ సమయంలో ఆయనకు 19.22 క్యారట్ల వజ్రం కనిపించింది. వెంటనే దానిని ప్రభుత్వ అధికారులకు అప్పగించారు. పన్నా డైమండ్ కార్యాలయం అధికారి అనుపమ్ సింగ్ మాట్లాడుతూ, ఈ వజ్రాన్ని త్వరలో జరిగే వేలంలో పెడతామన్నారు. జిల్లా కలెక్టర్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ, రాజుకు 19.22 క్యారట్ల వజ్రం దొరికిందన్నారు. వేలంలో దీనికి రూ.80 లక్షలకుపైగా పలికే అవకాశం ఉందని చెప్పారు. ఈ వజ్రాన్ని అమ్మగా వచ్చే సొమ్ముతో తన పిల్లలను చదివిస్తానని రాజు చెప్పారు.

## బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ రెండో దశ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'బాలిస్టిక్ మిస్సైల్ రక్షణ వ్యవస్థ' రెండో దశ ప్రయోగం సక్సెస్ అయ్యింది. 5 వేల కిలోమీటర్ల పరిధి కలిగిన శత్రు దేశ క్షిపణులను ఇది ఎదుర్కొనగలదు. ఒడిశాలోని చాందీపూర్‌లో ఈ ప్రయోగం చేపట్టారు. క్షిపణి రక్షణ వ్యవస్థ పూర్తి సామర్థ్యాలు ప్రదర్శించిందని రక్షణ శాఖ తెలిపింది. బాలిస్టిక్ క్షిపణిని పోలిన టార్గెట్ మిస్సైల్‌ను భూమి, సముద్రంపై ఏర్పాటు చేసిన రాడార్లు గుర్తించాయని, 'ఇంటర్‌సెప్టార్' వ్యవస్థతో దాన్ని కూల్చేశాయని పేర్కొన్నది.

## బగ్ కారణంగానే ఆగిన కంప్యూటర్లు: క్రౌడ్‌స్ట్రైక్

వాషింగ్టన్: కంప్యూటర్లు వైరస్‌లు, హ్యాకింగ్‌ల బారిన పడకుండా యాంటివైరస్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసే క్రమంలో ఒక బగ్ చేరిందని, దాని కారణంగా తమ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలోని వైరస్‌లతో కూడిన డాటా కోట్లమంది కంప్యూటర్లలోకి చేరిందని క్రౌడ్‌స్ట్రైక్ సంస్థ వెల్లడించింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా విమాన సేవలకు, టెలివిజన్ ప్రసారాలకు, బ్యాంకులు, దవాఖానల సేవలకు అంతరాయం ఏర్పడిందని వివరించింది. ఇకముందు ఇలాంటి అవాంతరాలు తలెత్తకుండా జాగ్రత్త వహిస్తామని తెలిపింది. ఏదైనా అప్‌డేట్ చేసేముందు వినియోగదారులకు సమాచారమందిస్తామని, వాటిని అధిగమించే సామర్థ్యాన్ని కూడా కల్పిస్తామని పేర్కొంది.

## కుప్వారాలో ఎన్‌కౌంటర్.. అమరుడైన సైనికుడు

శ్రీనగర్: జమ్ముకశ్మీరులోని కుప్వారాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ సైనికుడు అమరుడు కాగా, ఓ ఉగ్రవాది హతమయ్యాడు. సైన్యం తెలిపిన వివరాల ప్రకారం, ఉగ్రవాదుల కదలికలపై అందిన సమాచారం మేరకు కొద్ది రోజుల నుంచి లోలాబ్ ప్రాంతంలో సైన్యం, పోలీసులు ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. దాక్కున్న ఉగ్రవాదులను భద్రతా దళాలు మంగళవారం గుర్తించగలిగాయి. మంగళ-బుధవారాల మధ్య రాత్రి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ప్రతిస్పందించాయి. కాల్పుల్లో ఓ ఉగ్రవాది మరణించగా, సైనికుడు గాయపడ్డారు. ఆ తర్వాత ఆయన ప్రాణాలు కోల్పోయారు.

## 72 వేల దిగువకు పసిడి

**ఇంకో రూ.650 తగ్గిన తులం ధర**

న్యూఢిల్లీ, జూలై 24: బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఇదే సరైన సమయం. పసిడి, వెండిలపై కస్టమ్ డ్యూటీని తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న నిర్ణయంతో వరుసగా రెండోరోజు బుధవారం ధరలు భారీగా తగ్గాయి. అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతోపాటు దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో పుత్తడి ధర రూ.72 వేల దిగువకు పడిపోయింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర మరో రూ.650 దిగొచ్చి రూ.71,650కి తగ్గాయని ఆల్ ఇండియా సరాఫ అసోసియేషన్ వెల్లడించింది. అంతకుముందు ఈ ధర రూ.72,300గా ఉన్నది. గడిచిన రెండు రోజుల్లోనే ధరలు రూ.4 వేల స్థాయిలో తగ్గినట్టు అయింది. కానీ, వెండి ధరలు యథాతథంగా రూ.87,500 వద్ద ఉన్నాయి. కానీ, హైదరాబాద్‌లో మాత్రం ధరల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. 24 క్యారెట్ల పుత్తడి ధర రూ.70,860 వద్ద ఉండగా, 22 క్యారెట్ ధర రూ.64,950 వద్ద స్థిరంగా ఉన్నాయి. కానీ, వెండి మాత్రం రూ.500 తగ్గి రూ.92 వేలకు జారుకున్నది. కానీ, అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పుంజుకుంటున్నాయి. ఔన్స్ గోల్డ్ ధర ఆరు డాలర్లు పెరిగి 2,461.20 డాలర్లకు చేరుకోగా, వెండి 29.38 డాలర్ల వద్ద ఉన్నది.

వాణిజ్య

## గిట్లయితే ఏం లాభం

### పన్ను విధానంలో మార్పులు చేసినా ఫలితం శూన్యం

### ట్యాక్స్‌పేయర్లకు దక్కని ఊరట

న్యూఢిల్లీ, జూలై 24: వ్యక్తిగత పన్నుల విధానాన్ని పాత, కొత్త అంటూ వర్గీకరించిన మోదీ సర్కారు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను మంగళవారం ప్రకటించిన తాజా బడ్జెట్‌లోనూ తాము ఇష్టపడి తెచ్చిన కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చలేకపోయింది. చివరకు స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50,000 నుంచి రూ.75,000 మార్చినా ఫలితం మాత్రం శూన్యమే. ఉదాహరణకు మహేశ్ వయసు 45 సంవత్సరాలు. నెలకు రూ.15 లక్షల వార్షిక ఆదాయం ఉన్నది. నెలకు రూ.8,000 అద్దె తోపాటు, మరో రూ.20,000 హోమ్ లోన్ ఈఎంఐ చెల్లిస్తున్నాడు. అప్పుడు మహేశ్ పన్ను సహిత ఆదాయం ఎంత? దానికి చెల్లించాల్సిన పన్ను ఎంత? అన్నది ఒక్కసారి చూస్తే..

**కొత్త పన్ను విధానం (రూ.లలో)**

మొత్తం ఆదాయం : 15 లక్షలు
స్టాండర్డ్ డిడక్షన్ : 75 వేలు
పన్ను సహిత ఆదాయం : 14,25,000

**పన్ను లెక్కింపు ఇలా..**

3 లక్షల వరకు : పన్ను లేదు
3-7 లక్షలు : 20 వేలు (4 లక్షలపై 5%)
7-10 లక్షలు : 30 వేలు (3 లక్షలపై 10%)
10-12 లక్షలు : 30 వేలు (2 లక్షలపై 15%)
12-15 లక్షలు : 45 వేలు (2.25 లక్షలపై 20%)
నికర పన్ను : 1,25,000
ఆరోగ్య, విద్య సెస్సు: 5 వేలు (నికర పన్నుపై 4%)
మొత్తం చెల్లించాల్సినది: 1,30,000

**పాత పన్ను విధానం (రూ.లలో)**

మొత్తం ఆదాయం: 15 లక్షలు
స్టాండర్డ్ డిడక్షన్: 50 వేలు
హెచ్ఆర్ఏ మినహాయింపు: 1,20,000
గృహ రుణంపై వడ్డీ: 1,44,000
సెక్షన్ 80సీ మినహాయింపు: 1,44,000
పన్ను సహిత ఆదాయం: 10,42,000

**పన్ను లెక్కింపు ఇలా..**

2.5 లక్షల వరకు పన్ను లేదు
2.5-5 లక్షలు: 12,500 (2.5 లక్షలపై 5%)
5-10 లక్షలు: లక్ష రూపాయలు (5 లక్షలపై 20%)
10 లక్షలపైన: 12,600 (42 వేలపై 30%)
నికర పన్ను: 1,25,100
ఆరోగ్య, విద్య సెస్సు: 5,004 (నికర పన్నుపై 4%)
మొత్తం చెల్లించాల్సినది: 1,30,104

**ప్రస్తుతం ఆదాయ పన్ను రేట్లు**

పాత పన్ను విధానం

| శ్లాబులు (రూ.ల్లో) | ఐటీ రేట్లు |
|---|---|
| 2.50 లక్షల వరకు | లేదు |
| 2,50,001-5,00,000 | 5% |
| 5,00,001-10,00,000 | 20% |
| 10 లక్షలపైన | 30% |

కొత్త పన్ను విధానం

| శ్లాబులు (రూ.ల్లో) | ఐటీ రేట్లు |
|---|---|
| 3 లక్షల వరకు | లేదు |
| 3,00,001-7,00,000 | 5% |
| 7,00,001-10,00,000 | 10% |
| 10,00,001-12,00,000 | 15% |
| 12,00,001-15,00,000 | 20% |
| 15 లక్షలపైన | 30% |

## బీఎండబ్ల్యూ మరో ఈవీ

**సింగిల్ చార్జింగ్‌తో 460 కి.మీ. • ధర రూ.54.9 లక్షలు**

న్యూఢిల్లీ, జూలై 24: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ..పలు ఎలక్ట్రిక్ వాహనాలను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ ధర రూ.54.9 లక్షలు. ఈ కారు బ్యాటరీపై ఎనిమిదేండ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ కారు కేవలం 8.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 462 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 29 నిమిషాల్లో 80 శాతం వరకు బ్యాటరీ రీచార్జి కానున్నది. రెండు ఎయిర్‌బ్యాగ్‌లు, డైనమిక్ స్టేబిలిటీ కంట్రోల్, క్రాష్ సెన్సార్, యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, కార్నరింగ్ బ్రేక్ కంట్రోల్, రియర్ వ్యూ కెమెరా, ట్యూబ్‌లెస్ టైర్లు వంటి ఫీచర్‌తో రూపొందిం చింది. ఐదో జనరేషన్‌గా విడుదలైన ఈ కారు ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా కంపెనీకి ఉన్న డీలర్ల వద్ద బుకింగ్ చేసుకున్నవారికి సెప్టెంబర్ నుంచి డెలివరీ చేయనున్నట్లు తెలిపింది. దీంతోపాటు రూ.44.9 లక్షల ధర కలిగిన మినీ కూపర్ ఎస్ మాడల్‌ను కూడా విడుదల చేసింది.

### ప్రీమియం ఈ-స్కూటర్

దేశీయ మార్కెట్లోకి ప్రీమియం ఎలక్ట్రిక్ స్కూటర్ సీఈ 04ని అందుబాటులోకి తీసుకొచ్చింది బీఎండబ్ల్యూ. ఈ స్కూటర్ ధర రూ.14.90 లక్షలు. కేవలం 2.6 సెకండ్లలో 50 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ స్కూటర్ గంటకు 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. దేశీయంగా తయారైన ఈ స్కూటర్ మెట్రోపాలిటన్ సిటీల్లో మాత్రమే విక్రయించనున్నది. బుకింగ్ చేసుకున్న వారికి సెప్టెంబర్ నుంచి డెలివరీ చేయనున్నది.



## ఇంట్రా-డే ట్రేడర్లకు నష్టాలే

- ప్రతీ 10 మందిలో ఏడుగురికి ఇంతే
- సెబీ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 24: ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ప్రతీ 10 మంది వ్యక్తిగత ఇంట్రా-డే ట్రేడర్లకు ఏడుగురు లేదా 71 శాతం నష్టాలకే పరిమితమవుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చేపట్టిన తాజా అధ్యయనం ఇదే చెప్తున్నది మరి. ఇక 2018-19తో పోల్చితే 2022-23లో ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ఇంట్రా-డే ట్రేడింగ్ చేసినవారు 300 శాతానికిపైగా పెరగడం గమనార్హం. అలాగే 30 ఏండ్ల కంటే తక్కువ వయసున్న వ్యక్తులు ఈ తరహా ట్రేడింగ్‌పై ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నట్టు కూడా బుధవారం సెబీ విడుదల చేసిన అధ్యయనం తేల్చింది. ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్ ఇంట్రా-డే ట్రేడింగ్‌లో ఇండివిడ్యువల్స్ భాగస్వామ్యం, వారిద్వారా జరుగుతున్న లాభనష్టాలను తెలుసుకోవడానికే ఈ అధ్యయనాన్ని నిర్వహించినట్టు సెబీ తెలియజేసింది. 2018-19, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లోని తీరుతెన్నులను ఈ సందర్భంగా పరిశీలించింది. కరోనాకు ముందు, ఆ తర్వాత సరళిని కనిపెట్టేందుకే ఈ సంవత్సరాలను ప్రాతిపదికగా తీసుకున్నట్టు వివరించింది. కాగా, ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో దాదాపు 86 శాతం ఇండివిడ్యువల్ క్లయింట్లున్న టాప్-10 స్టాక్ బ్రోకర్ల క్లయింట్ల ఆధారంగా ఈ అధ్యయనం జరిగింది. వీరిలో ప్రతీ ముగ్గురిలో ఒకరు ఇంట్రా-డే ట్రేడింగ్‌లో పాల్గొన్నట్టు తేలింది. ఈ క్రమంలోనే 2018-19తో చూస్తే 2022-23లో 30 ఏండ్ల దిగువ ఉన్నవారు 18 శాతం నుంచి 48 శాతానికి పెరిగినట్టు బయటపడింది. ఇదిలావుంటే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) విభాగంలో ట్రేడింగ్ చేస్తున్న మదుపరులూ గణనీయంగా పెరుగుతున్నట్టు సెబీ స్పష్టం చేసింది. 2018-19లో 7.1 లక్షలుగా ఉన్న వ్యక్తిగత ట్రేడర్లు.. 2020-21లో 45.24 లక్షలకు ఎగబాకినట్టు సెబీ అధ్యయనం వెల్లడించింది.

## వరుసగా నాలుగో రోజూ నష్టాలు

**సెన్సెక్స్ 280, నిఫ్టీ 65 పాయింట్ల నష్టం**

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజు నష్టపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్, సెక్యూరిటీస్ లావాదేవీ పన్నును పెంచుతూ తీసుకున్న నిర్ణయం మదుపరులకు షాక్ గురిచేసింది. దీంతో ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతో ఒక దశలో 80 వేల దిగువకు పడిపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 280.16 పాయింట్ల నష్టంతో 80,148.88 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 65.55 పాయింట్లు నష్టపోయి 24,413.50 వద్ద స్థిరపడింది. 19 షేర్ల ఇండెక్స్‌లు నష్టపోగా, 11 షేర్ల ఇండెక్స్‌లు లాభాల్లో ముగిశాయి.

### *చారిత్రక కనిష్ఠ స్థాయికి*
## రూపాయి

రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 2 పైసలు కోల్పోయి చారిత్రక కనిష్ఠ స్థాయి *83.71*కి జారుకున్నది. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతోపాటు ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ఉండటం మారకంపై ప్రతికూల ప్రభావం చూపింది. *83.69* వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు ఒక దశలో అల్‌టైం కనిష్ఠ స్థాయి *83.72*ని తాకింది. చివరకు రెండు పైసలు నష్టపోయి *83.71* వద్ద ముగిసింది. మరోవైపు మంగళవారంలో కూడా మారకం విలువ 3 పైసలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## టీ హబ్‌తో బియాండ్ ఒప్పందం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): మలేషియాకు చెందిన బియాండ్ 4తో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది టీ హబ్. బుధవారం టీ హబ్ కార్యాలయంలో బియాండ్ 4 సీఈవో ఎస్‌టీ రుబనేశ్వరన్, టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు ఒప్పంద పత్రాలపై ఇరువురు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు మాట్లాడుతూ.. బియాండ్ 4తో కుదుర్చుకున్న ఒప్పందంతో భారత్‌తోపాటు మలేషియాల మధ్య బలమైన స్టార్టప్ ఎకోసిస్టం పెంపొందించడానికి వీలు పడుతుందన్నారు. రెండు సంస్థలు కలిసి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయని, ఇదే సమయంలో పెట్టుబడులు మరింత సులభతరం కానున్నదన్నారు. బియాండ్ 4 మలేషియా సంస్థ సీఈవో ఎస్‌టీ రుబనేశ్వరన్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతున్నదని, ఆర్ఎం 345.9 బిలయన్ల పెట్టుబడులు పెట్టాలను కుంటున్నట్లు చెప్పారు.

## 'బ్యాంకుల్లో నగదు చెల్లింపుల నిబంధనలు కఠినతరం'

ముంబై, జూలై 24: బ్యాంకుల వద్ద నగదు చెల్లింపు సేవలను రిజర్వు బ్యాంక్ మరింత కఠినతరం చేసింది. ఇకపై బ్యాంకులు తమ వద్ద ఖాతాలేని వారికి ఇస్తున్న నగదు విషయంలో ఆ వ్యక్తుల రికార్డులను భద్రపరుచాలని సెంట్రల్ బ్యాంక్ సూచించింది. దేశీయ నగదు లావాదేవీలకు సంబం